కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

- పొంచి ఉన్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు, గ్రామస్తులు



గోవింద్‌పేట్ వెళ్లే మార్గంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్



గోవింద్‌పేట్ నుంచి ఆర్మూర్ వెళ్లే మార్గంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

పెర్కిట్ : ఆర్మూర్ మండలంలో విద్యుత్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఎలాంటి రక్షణ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఆర్మూర్ నుంచి గోవింద్‌పేట్ వెళ్లే మార్గంలో, గోవింద్‌పేట్ నుంచి ఆర్మూర్ వచ్చే మార్గంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్డును ఆనుకుని ఉండడంతో వాహనాలు అదుపు తప్పి ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొనే ప్రమాదాలు ఉన్నాయి. పదిహేను రోజుల క్రితం పెర్కిట్‌లో వదులుగా ఉన్న విద్యుత్ తీగలు తగిలి నాలుగు గేదెలు మృతి చెందిన ఘటన విదితమే. అయినా విద్యుత్ శాఖ అధికారుల్లో చలనం రావడం లేదు. దీంతో పాటు గోవింద్‌పేట్‌లో గతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఓ గేదె మృతి చెందింది. గోవింద్‌పేట్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ చర్యలు కనపడడం లేదు. అసలే వర్షాకాలం కావున ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటికి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతులకు అండగా రైతు నేస్తం



ఆలూర్‌లో కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అన్వేష్ రెడ్డి

పెర్కిట్: సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమం రైతులకు అండగా ఉంటుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణం, ఆలూర్ మండల కేంద్రంలోని రైతు వేదికల్లో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో కలిసి వీక్షించారు. డీసీవో శ్రీనివాస్, ఏడీఏ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఎంపీవోలు హరికృష్ణ, రాంబాబు, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్, ఆలూర్ మండలాల అధ్యక్షులు చిన్నా రెడ్డి, విజయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్: మండలంలోని నందిపేట, చింరాజ్‌పల్లి, కుద్వాన్‌పూర్, రైతు వేదికల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన రైతు నేస్తం కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు స్థానిక రైతులతో కలిసి వీసీ ద్వారా వీక్షించారు. తహసీల్దార్ సంతోష్‌కుమార్, మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న భవాని, గంగారెడ్డి, మంద మహిపాల్, రైతులు పాల్గొన్నారు.

బోధన్, మాక్లూర్‌లో..

బోధన్/ మాక్లూర్: రైతు నేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో సోమవారం సాయంత్రం సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ శశిభూషణ్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోనిజాన్కంపేట, ఎడపల్లి గ్రామ రైతు వేదిక భవన్‌ల్లో రైతు నేస్తం ప్రారంభోత్సవ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మాక్లూర్ మండల కేంద్రంతో పాటు అమ్రాద్, గొట్టిముక్కులలోని రైతు వేదికల్లో రైతు నేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వీసీలో సీఎం నేటి నుంచి రైతు భరోసా జమకానున్నట్లు వెల్లడించినట్లు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

అక్షర పల్లకి విద్యా విధానం ఆవిష్కరణ



వేల్పూర్ : వేల్పూర్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఎమ్ఎస్ ఆచార్య రూపొందించిన నూతన తెలుగు విద్యా విధానం అక్షర పల్లకిని సోమవారం ఆవిష్కరించారు. పరిశోధనాత్మకమైన, ప్రతిష్ఠాత్మకమైన తెలుగు విద్యా విధానమైన అక్షర పల్లకిని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆమోదించారని ఆచార్య వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజన్న, విశ్వాస్‌రెడ్డి, పిల్లమారి సుధీర్, స్వర్గన్ రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలను సిద్ధం చేయాలి



మోర్తాడ్: వర్షాకాలం ప్రారంభమైనందున నర్సరీలలోని మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్ సూచించారు. సోమవారం బాబాపూర్, బాబానగర్‌లో నర్సరీలను పరిశీలించారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షించే బాధ్యతను అందరూ తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో నర్సయ్య, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

బోధన్: ఎడపల్లి మండలంలో ఈ నెల 3న ప్రారంభమైన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులు సోమవారం ముగిశాయి. ఆఖరి రోజు ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సదస్సు నిర్వహించగా ఇబ్రహీంపూర్ రెవెన్యూ శివారు గల రైతులు భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించగా తహసీల్దార్ దత్తాద్రి స్వీకరించారు. సదస్సులో మొత్తం 698 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ వెల్లడించారు. నాయబ్ తహసీల్దార్ అనూష, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్‌లోని తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములను కొందరు ఆక్రమించారని వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యాక్రమంలో నాయకులు కుతాడి ఎల్లయ్య, నాగరాజు, సాయిలు, కుల్దీప్‌శర్మ, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారు..



మోర్తాడ్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తోందని బీఆర్ఎస్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య ఆరోపించారు. ప్రభుత్వ తీరుపై ప్రశ్నిస్తున్న తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులను నమోదు చేస్తోందని వెల్లడించారు. సోమవారం ఆయన భీమ్‌గల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటీఆర్‌పై ఇప్పటి వరకూ 14 అక్రమ కేసులను కాంగ్రెస్ నాయకులు నమోదు చేయించారని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలపై అక్రమ కేసులను నమోదు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తోందని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల తయారీ కేంద్రం పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో డంపింగ్ యార్డులోని పొడి వ్యర్థ వనరుల కేంద్రాన్ని, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం పరిశీలించారు. అలాగే 14, 35వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇంటింటికి వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. శానిటరి ఎస్సై గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, వార్డు అధికారులు శివ, నర్సయ్య, జవాన్లు, రాజన్న, మెప్మా ఆర్పీలు ఉన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం, శ్రీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులకు సోమవారం మాదాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ట్రస్ట్ మేనేజర్ ఠాగూర్, వర్ని ఎంఈవో సాయిలు, ట్రస్టు సభ్యులు పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

పాఠశాల దుస్తుల పంపిణీ

మోర్తాడ్: మోర్తాడ్‌లోని ఎస్సీ, బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచిత యూనిఫాంలను హెచ్ఎం మగ్గిడి ప్రవీణ్ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ మహేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా ఉంటాం



ఆర్మూర్: రాష్ట్రంలో ఉన్న వికలాంగుల సమస్యల పోరాటానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం స్నేహ వికలాంగుల వైకల్య వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఆర్మూర్ డివిజన్‌లోని వికలాంగులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అనంతరం వికాలంగల సమస్యలను ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడాలని వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ వికలాంగుల సమస్యల వినతి పత్రాన్ని గంగారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్‌లోని వికలాంగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహనీయుల చిత్రపటాల బహూకరణ



వేల్పూర్ : మండలంలోని అంక్సాపూర్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో 12 మంది దేశ మహనీయుల చిత్రపటాలను సోమవారం బహూకరించారు. మహనీయుల చిత్రపటాలను బహూకరించిన రోటరీక్లబ్ సభ్యులకు హెచ్ఎం మల్లీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు రజనీశ్‌కిరాడ్, రాస ఆనంద్, శశిధర్, ఉపాధ్యాయులు రవిచంద్ర, రఘునాథ్, సునీత, శ్రీదేవి, యమున, కాంతయ్య పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



బోధన్ : పట్టణంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ స్థలాలను కొందరు ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) నాయకులు, కాలనీ మహిళలు సబ్ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ మోసిన్, తోట సంగీత, ఉష, శోభ, గౌసియా, అహ్మద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రెంజల్ : మండలంలోని బోర్గాం, పేపర్‌మిల్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ఆరోగ్య విస్తీర్ణ అధికారులు సోమవారం అవగాహన కల్పించారు. కీటక జనిత వ్యాధులు, దోమల నివారణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు చింతల శ్రావణ్ కుమార్, రవీందర్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడిగంట వితరణ

వేల్పూర్ : మండలంలోని పడగల్ ఉన్నత పాఠశాలకు 2024–25 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ. 10 వేల విలువైన ఎల్రక్టానిక్ బడిగంటను సోమవారం వితరణ చేశారు. హెచ్ఎంలు రాంచందర్, సరోజిని, టీచర్లు జలంధర్, నారాయణ, శంకర్, దాస్, సుమలత, రాంచందర్, గోదావరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బోధన్‌టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ వెంకటనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రయాణికులు, పోలీసులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఆర్మూర్‌టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్‌చైర్మన్ విట్టం జీవన్, మారా చంద్రమోహన్, చిన్నారెడ్డి, మంద మైపాల్, భూమేశ్, పండిత్ పవన్, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రెంజల్: మండలంలోని నీలా గ్రామంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగాకృష్ణ, ఎంఎల్ రాజు, గంగాకిషన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌ల అందజేత

పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అలాగే చేపూర్ సమీప గ్రామమైన హరిపూర్‌లో 60 ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు వినయ్‌రెడ్డి తెలిపారు.

పరామర్శ

చేపూర్ గ్రామానికి చెందిన బట్టు నాగార్జున్ ఉపాధి కోసం అబుదాబికి వెళ్లి ఇటీవల కనపడకుండా పోయాడు. దీంతో నాగార్జున కుటుంబ సభ్యులను వినయ్ రెడ్డి పరామర్శించారు. సీఎంతో మాట్లాడి నాగార్జున ఆచూకి కోసం ప్రయత్నిస్తానని వారికి హామీ ఇచ్చారు.

సంక్షిప్తం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలి



మోర్తాడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని భీమ్‌గల్ ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన బాబాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు చేపట్టిన పనులను పరిశీలించారు. ఏపీవో నర్సయ్య, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్: అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా సబ్ డివిజన్ కార్యదర్శి బి కిషన్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంకాపూర్‌లో అర్హులను గుర్తించిన తర్వాత అందులో కొంత మంది పేర్లను తొలగించడం అన్యాయం అన్నారు. అదేవిధంగా అర్హులకు రేషన్‌కార్డులను మంజూరు చేయాలన్నారు. నాయకులు నజీర్, రవి, సాయమ్మ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

పెర్కిట్/ బోధన్: ఆలూర్ మండలం మిర్దాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు ఎంపీడీవో గంగాధర్ సోమవారం అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం సాలూర మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని టీచర్లు నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ డిస్కో సాయిలు, అంగన్‌వాడీ టీచర్లు సునీత, గంగామణి, గోదావరి, సరోజ, మహాదేవి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సంఘం పదాధికారులకు శిక్షణ

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని గ్రామ సంఘాల పదాధికారులకు సోమవారం ఐకేపీ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. పదాధికారుల విధులు, బాధ్యతలు, ఆర్థిక లావాదేవీలు, సంఘం ఖాతాల నిర్వహణ, సమావేశాలు, శిక్షణలు ఇలా ఎన్నో అంశాలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, వడ్డీలేని రుణాలు, విద్యార్థులకు యూనిఫాంలను కుట్టించడం, ఉచిత బస్సు, క్యాంటీన్‌లు, పెట్రోల్ పంపుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్, సీనియర్ సీసీలు శ్రీనివాస్, పురస్తు నరేశ్, సీఆర్పీలు లత, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అబ్బాపూర్(ఎం)లో పోలీస్ రోల్‌కాల్

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో పోలీస్ రోల్‌కాల్ నిర్వహించారు. గ్రామంలోని వీధుల గుండా గ్రామస్తులతో కలిసి ఫూట్ పెట్రోలింగ్ చేశారు. ఎస్సై వినయ్ మాట్లాడుతూ.. ప్రజల వద్దకే పోలీస్ అన్న నినాదంతో ప్రతి గ్రామానికి పోలీస్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్సై మోహన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి చిత్రం

ప్రమాదకర గుంతను పూడ్చండి..

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలోని సహకార సంఘం ఎదుట ఉన్న కల్వర్టు మధ్య భాగంలో ప్రమాదకర గుంత ఏర్పడింది. దీంతో రాత్రిపూట గుంతను గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేసేలా చర్యలు తీసుకోవాలి.

– గోపి, బాల్కొండ



కల్వర్టుపై ఏర్పడిన గుంత

దాస్‌నగర్‌లో మాక్లూర్ పోలీస్‌స్టేషన్

- నెలాఖరు నాటికి ప్రారంభం
- సిద్ధమైన కొత్త భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోలీస్‌స్టేషన్ భవనం

మాక్లూర్ : మండల కేంద్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్ మరో 15 రోజుల్లో దాస్‌నగర్ చౌరస్తా వద్ద నిర్మించిన కొత్త భవనంలోకి మారనుంది. దాస్‌నగర్ నుంచి రాంచంద్రాపల్లి వరకు గల 63వ నంబర్ జాతీయ రహదారిపై అధిక నేరాలు నమోదు కావడంతో పదేళ్ల క్రితం కొత్త పోలీస్‌స్టేషన్ నిర్మించాలనే ప్రతిపాదన వచ్చింది. నాటి ప్రభుత్వం దాస్‌నగర్‌లో భవన నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలు నిధులు కూడా విడుదల చేసింది. కాంట్రాక్టర్ జాప్యంతో భవన నిర్మాణం ఆలస్యం కాగా, పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీంతో కొత్త పోలీస్ స్టేషన్ భవన పనులు చకచకా పూర్తయ్యాయి. మాక్లూర్ నుంచి దాస్‌నగర్‌కు పోలీస్ స్టేషన్ మారడంతో కొత్తపల్లి, చిక్లీ, వల్లభాపూర్, ధర్మోర తదితర గ్రామాలకు అధిక దూరమవుతుందన్న విమర్శలూ ఉన్నాయి. కాగా, నేరాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకే పోలీస్‌స్టేషన్‌ను మాక్లూర్ నుంచి దాస్‌నగర్‌కు మార్చాల్సి వచ్చిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

త్వరలోనే కొత్త భవనంలోకి..

ఈ నెలాఖరు నాటికి కొత్త పోలీస్‌స్టేషన్ భవనంలోకి మారుతాం. భవన ప్రారంభోత్సవ తేదీ ఇంకా ఖరారు కాలేదు. పనులన్నీ పూర్తి చేసుకొని భవనం సిద్ధంగా ఉంది. కొత్త భవనంలోకి వచ్చిన తర్వాత మాక్లూర్ పాత పోలీస్‌స్టేషన్ భవనంలో కార్యకలాపాలు ఏమీ ఉండవు.

– రాజశేఖర్, ఎస్సై మాక్లూర్

రైతు సంక్షేమమే ధ్యేయం



హెగ్డోలిలో మాట్లాడుతున్న నాగం సాయిలు

రుద్రూర్ : రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని బాన్సువాడ నియోజకవర్గ ఓబీసీ మోర్చ కన్వీనర్ నాగం సాయిలు అన్నారు. పొతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం రైతులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు భజరంగ్ హన్మాండ్లు, వెంకటేశ్వర్లు, శంకర్, వెంకట్, రామ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న అంతిరెడ్డిరాజారెడ్డి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం విడుదల చేస్తున్న నోటిఫికేషన్లకు అభ్యర్థులు కష్టపడి చదివి, ఉద్యోగాలు సాధించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గ్రంథాలయాన్ని గ్రంథాలయ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అంతిరెడ్డి రాజిరెడ్డిని, వినయ్‌రెడ్డిని గ్రంథాలయపాలకురాలు వరలక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



యోగా వాక్ చేస్తున్న సిబ్బంది

యోగాతో మానసిక ప్రశాంతత

రుద్రూర్ : యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు అనేక ప్రయోజనాలు ఉన్నాయని పొతంగల్ పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యురాలు రాధిక అన్నారు. పొతంగల్ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం హైస్కూల్ విద్యార్థులకు యోగా ఇన్‌స్ట్రక్టర్లు డి సతీశ్‌గౌడ్, ఇందూర్ జ్యోతి సోమవారం యోగాపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి యోగా వాక్ చేశారు. హెచ్ఎం విమల, జయకృష్ణ, రవీంద్ర బాబు, సావిత్రి, సుజాత, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్ : రెంజల్ ఆదర్శ కళాశాలలో పీజీటీ(బొటని) పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునాలని ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గంటల ప్రతిపాదికన నియామకం ఉంటుందన్నారు. బొటని బోధించుటకు ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు. ఈ నెల 19న కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరు కావాలని సూచించారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో భక్తులు సోమవారం అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొని శివాలయంలో లింగానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నందీశ్వర మహారాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకి సేవ చేపట్టారు.